క్లుప్తంగా

పవిత్ర వృక్షాలకు పూజలు



ఐఏఎస్ అధికారి శ్రీధర్‌ను సన్మానిస్తున్న గుడ్లూరు మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఓ హోటల్లో బుధవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి బి.శ్రీధర్ దంపతులు రుద్రాక్ష, బిల్వపత్ర, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. శ్రీధర్ మాట్లాడుతూ శైవక్షేత్రంలో ఇలాంటి అరుదైన వృక్షాలు ఒకే చోట ఉండడం విశేషమన్నారు. కార్యక్రమంలో గుడ్లూరు మల్లికార్జున నాయుడు, గుడ్లూరు మయూర్ పాల్గొన్నారు.

శరవేగంగా సిమెంట్ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏర్పేడు: స్థానిక కమ్మవీధి నుంచి చేపట్టిన నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఈ పనులను బుధవారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య పరిశీలించారు. 270 చదరపు మీటర్ల దూరానికి రూ.11.5 లక్షల ఎంపీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈ రవితేజ, శివచంద్ర, వరదప్ప నాయుడు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ క్రాప్ నమోదులో వ్యవసాయాధికారిణి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. ఆమె బుధవారం వెస్టువరత్తూరు, నెలవాయి, కారణి, గ్రామాల్లోని పంట పొలాలకు వెళ్లి ఈ–క్రాప్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి రైతుకు సంబంధించిన భూమిలో వేసిన పంటలను ఈ క్రాప్ నమోదు చేయాలని తెలిపారు. రైతులకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్బీకే ప్రారంభోత్సవం

నారాయణవనం: మండల కేంద్రంలోని సచివాలయ పరిధిలో ఆర్బీకే నూతన భవనాన్ని గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొని, ఆర్బీకే భవనాన్ని ప్రారంభించే కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆటోవాలాలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ దామోదర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం ప్రమాదాల నివారణపై ఆటోవాలాలకు శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కూలీలను పరిమితికి మించి ఆటోల్లో ఎక్కించకూడదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని, జరిమానాతోపాటు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పిస్తే, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమార్‌టన్ పథకంలో నగదును బహుమతి అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటనరసింహం, కానిస్టేబుళ్లు ప్రభాకర్, సురేష్‌బాబు, రమేష్ పాల్గొన్నారు.

13 షాపులకే దరఖాస్తులు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ మినహా జిల్లాలో ఖాళీగా ఉన్న 33 ఆర్టీసీ దుకాణాలకు బుధవారం తిరుపతి డీపీటీఓ కార్యాలయంలో బుధవారం టెండర్లు నిర్వహించారు. డెప్యూటీ సీటీఎం భాస్కర్, పీఓ పార్థసారథి, డీఎం బాలాజీ నేతృత్వంలో టెండర్లు చేపట్టారు. అయితే 13 దుకాణాలకు సంబంధించి మాత్రమే 28 దరఖాస్తులను విక్రయించారు. అందులో 23 దరఖాస్తులను మాత్రమే వేశారు. మరో నాలుగు రోజుల్లో 13 షాపులకు సంబంధించి వచ్చిన 23 టెండర్లను పరిశీలించి ఖరారు చేయనున్నారు. అయితే అన్ని దుకాణాలకు దరఖాస్తులు అందలేదు.

రెండో రోజు అదే జోరు



శ్రీకాళహస్తి: ఆడుదాం ఆంధ్రా కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఏర్పేడు: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం–ఆంధ్ర క్రీడల కార్యక్రమం రెండో రోజైన బుధవారం యువత అదే జోరుతో క్రీడల్లో పాల్గొన్నారు. మండలంలోని 67 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం–ఆంధ్రా క్రీడలను ప్రజాప్రతినిధులు, అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో క్రీడల పోటీలు జరుతున్నాయి.

ఆడుదాం ఆంధ్రా కిట్‌ల పంపిణీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని 28, 29వ వార్డు సచివాలయాల పరిధిలో బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు పానగల, జీకే రెడ్డి కాలనీ, బృందావన కాలనీ యువతకు క్రికెట్ కిట్‌లను పంపిణీ చేశారు. కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ నేడు యువత ఆరోగ్యకరమైన జీవనం సాగించడానికి కీడ్రలు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జ్ఞానాంబ మధురెడ్డి, మురళి, వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు తలప దామోదర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి పెంపునకు కృషి

సత్యవేడు: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ఆడుదాం– ఆంధ్ర కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఇరుగుళం సర్పంచ్ శేఖర్ అన్నారు. సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన క్రీడలను సర్పంచ్ ప్రారంభించారు. మండల పరిధిలో ఇరుగుళం, ఆరూరు, చెరివి పంచాయతీలలో జరిగిన బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలలో 33 బృందాలు పాల్గొన్నాయి. అందులో 181 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, క్రీడా పోటీలను పర్యవేక్షించారు.

హోరాహోరీగా పోటీలు

పిచ్చాటూరు: ఆడుదాం–ఆంధ్ర ఆటల పోటీలు సచివాలయ పరిధిలో బుధవారం హోరాహోరీగా సాగింది. క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఆయా సచివాలయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను పర్యవేక్షించారు. ఈ నెల 29 వరకు సచివాలయ పరిధిలో పోటీలు జరుగుతాయని, అనంతరం మండల స్థాయి పోటీలు ఉంటాయని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. రెండో రోజు పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడాకారులకు వరం

వరదయ్యపాళెం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర టోర్నీ గ్రామీణ క్రీడాకారులకు ఒక వరం లాంటిదని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బత్తలవల్లంలో బుధవారం క్రీడా పోటీలను అధికారులు, ప్రజాప్రతినిధులు లాంఛనంగా ప్రారంభించారు. వక్తలు మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గౌరిశంకరరావు, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, స్థానిక సర్పంచ్ లోకేశ్వరి, ఎంపీటీసీ కస్తూరి, సచివాలయ కన్వీనర్ గిరిరెడ్డి, నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఉజ్వల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిచ్చాటూరు సచివాలయ పరిధిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



ఏర్పేడు: క్రీడా పోటీల్లో తలపడుతున్న యువత



సత్యవేడు: ఆరూరులో వాలీబాల్ పోటీలో క్రీడాకారులు



పిచ్చాటూరు: కబడ్డీ ఆడుతున్న మహిళా క్రీడాకారులు

ప్రశాంతంగా నూతన వేడుకలు

పిచ్చాటూరు: మండలంలో నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బైక్ రైడింగ్, ట్రిబుల్ రైడింగ్, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించడం, రాకపోకలకు అంతరాయం కలిగించడం, భారీ స్పీకర్లు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడం, రోడ్లపై మద్యం సేవిస్తూ అలజడి సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఇలాంటి చర్యలను అరికట్టడానికి తమ సిబ్బంది నిఘా ఉంచుతారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ వెల్లడించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొని పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.30వేలు విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గోవాకు చెందని ఐఏఎస్ అధికారి నిఖిల్ యు దేశాయ్ రూ.30వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అధికారులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

సిపాయి భరోసా అందజేత



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని పాతవీరాపురం పంచాయతీ పరిధి గుండరాయనిమిట్ట గ్రామానికి చెందిన సుబ్బమ్మ(52) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బుధవారం గుండరాయనిమిట్ట గ్రామానికి వెళ్లి తమ ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద కుటుంబానికి ఏడాదికి సరిపడే 40 రకాల నిత్యావసర సరకులను అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ ఎంపీటీసీ చెంబేటి మునిరత్నంరెడ్డి, డాక్టర్ బాబు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు దామోధరంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మునిరామిరెడ్డి, రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండండి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి దివాకర్ హెచ్చరించారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటాయని చెప్పారు. కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులు, దోమల ద్వారా వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాగాలి గ్రామంలో మృతుడి కుటుంబానికి బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. పాగాలి గ్రామానికి చెందిన సుబ్బరామిరెడ్డి(54) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనల మేరకు గున్నేరి కిషోర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.15 వేలు నగదును అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకులు వేణురెడ్డి, పెంచలరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, చెంగల్‌రాయులు, వాసు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సిమెంటు బస్తాల నిల్వల్లో తేడా



సత్యవేడు హౌసింగ్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఈఈ మోహన్ రావు

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ సిమెంటు స్టాకు గోదాములో 1400 బస్తాలు తక్కువగా ఉన్నట్లు ఈఈ మోహన్‌రావు గుర్తించారు. సత్యవేడు హౌసింగ్ కార్యాలయాన్ని బుధవారం హౌసింగ్ ఈఈ మోహన్‌రావు తనిఖీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన స్టీలు, సిమెంటు, లబ్ధిదారుల వివరాల రికార్డులను పరిశీలించారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఈ వెంకటసుబ్బయ్య రెండు నెలల క్రితం విరమణ పొందారు. ఏఈగా వెంకటసుబ్బయ్య పనిచేస్తున్న సమయంలో మంజూరైన 1400 సిమెంటు బస్తాలు గోదాముకు చేరకనే పక్కదారి మళ్లించారని ఈఈ తెలిపారు. సత్యవేడు, నాగలాపురం మండలాలకు ఇన్‌చార్జిగా ఉన్న రిటైర్డు ఏఈ సత్యవేడుకు సంబంధించి 700, నాగలాపురం మండలానికి సంబంధించి 700 సిమెంటు బస్తాల స్టాకు వివరాలు మాయమైనట్లు గుర్తించామన్నారు. వీటి విలువ రూ.3.78 లక్షలుగా తెలిపారు. తనిఖీ వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం





ఇంటి పన్ను బిల్లులు అందజేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. మండలంలోని దొడ్లమిట్ట బీసీ కాలనీలో బుధవారం ఇంటి పన్ను బిల్లులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత 30 ఏళ్లగా గ్రామస్తులకు ఇంటి పన్నులు లేవని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారని గుర్తుచేశారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఇంటి పన్నులకు సంబంధించిన బిల్లులు అందజేసి ఎమ్మెల్యే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నట్లు పేర్కొన్నారు. మరింత అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీలు శ్రావణి, కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ ఖాన్, సుబ్రమణ్యం, పార్థసారథి, చంద్రమౌళి, బాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి వరదయ్యపాళెం విద్యార్థి



విద్యార్థి మోహనకృష్ణ

వరదయ్యపాళెం: జాతీయ స్థాయిలో జరిగే టెన్నిస్ వాలీబాల్ క్రీడా పోటీలకు అండర్–14 విభాగంలో వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ఓలిపి మోహనకృష్ణ ఎంపికయ్యాడు. మండలంలోని చెన్నవారిపాళెంకు చెందిన ఈ విద్యార్థి ఇటీవల తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు స్థానిక ఫిజికల్ డైరెక్టర్ కుమార్ తెలిపారు. కేరళలో జరిగే జాతీయస్థాయి టెన్నిస్‌వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నారు. జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు ఎంపికైన ఓలిపి మోహనకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నూతన క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఐఈవో విశ్వనాథనాయక్ ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, రవి, నాన్‌టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కందాటి విశ్వేశ్వర రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శరత్ సాహిత్య అధ్యయనంపై పుస్తకావిష్కరణ

తిరుపతి కల్చరల్: 'మానవుల మరణం అంతగా బాధించదు.. కానీ మానవ విలువల మరణం నన్ను అత్యంతగా బాధిస్తుంది' అని ప్రకటించిన శరత్ సాహిత్య అధ్యయనం నేటికీ ఎంతో అవసరమని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి ప్రవాష్‌ఘోష్ రాసిన శరత్ సాహిత్యాన్ని నేటికీ అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఏమిటి అనే పుస్తకాష్కరణ సభ బుధవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ పుస్తకావిష్కరణ సభకు సీనియర్ జర్నలిస్టు ఎ.రాఘవ శర్మ, ఎస్‌యూసీఐ(సి), రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.గోవిందరాజులు, ప్రముఖ రచయిత, సాహితీవేత్త సాకం నాగరాజు, రిటైర్డ్ జిల్లా జడ్జి పి.గురప్ప, ఎస్వీయూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ డి.గోవిందులు వక్తలుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఫ్యూడల్ కట్టుబాట్లు బలంగా ఉన్న కాలంలో స్వాతంత్ర్య పోరాట నేపథ్యంలో శరత్ సాహిత్యం వచ్చిందని, అలాంటి సాహిత్యాన్ని నేటికీ ఎందుకు చదవాలన్న ప్రశ్న ఉదయిస్తున్న నేపథ్యంలో శరత్ సాహిత్యంపై మంచి విశ్లేషణ ఇప్పుడు మన ముందుకు వచ్చిందన్నారు. 19వ శతాబ్దంలో ఉన్న ఫ్యూడల్ సమాజంలో స్త్రీల పరిస్థితి చాలా దారుణంగా ఉండేదన్నారు. జైభీమ్ గ్రంథాలయ నిర్వాహకుడు కాళయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆచార్య చక్రవర్తి రాఘవన్, ఏఎస్ పరమేశ్వరరావు, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక విద్యా బోధనకు ట్యాబ్‌ల పంపిణీ



బీఎన్ కండ్రిగ, కళ్లివెట్టులో అందుకున్న ట్యాబ్‌లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యా బోధన అందించాలన్న సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేస్తోందని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం కళ్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకన్నా బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆరుద్ర ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో శివగామీ సమేత నటరాజస్వామి



ఊరేగుతున్న నటరాజ స్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ అగస్తీశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆరుద్ర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు శివగామీ సమేత నటరాజస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ధనుర్మాసంలో శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర రోజైన బుధవారం వేకువ జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు అగస్తీశ్వరస్వామి మహన్యాస పూర్వ అభిషేకాన్ని నిర్వహించి, ధనుర్మాసపూజలను, నైవేద్యాలను సమర్పించారు. అనంతరం మరగవల్లీ సమేత నటరాజ స్వామిని ప్రత్యేక ఆరుద్ర అభిషేకాలను పూర్తి చేసిన అర్చకులు ఆలయ ప్రాకారంలో వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించిన మండపంలో ప్రతిష్ఠింపజేశారు. అర్చనలు, నైవేద్య సమర్పణ అనంతర భక్తులను 5 గంటలకు దర్శనానికి అనుమతించారు.

భక్తులు అధిక సంఖ్యలో ఆరుద్ర దర్శనం చేసుకుని, నటరాజస్వామికి అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కైలాసనాథకోన కామాక్షాంబిక సమేత కైలాసనాథునికి వేకువ జామున అభిషేకాలను పూర్తి చేసి, ధనుర్మాస నైవేద్యాలను సమర్పించిన అర్చకులు భక్తులను దర్శనానికి అనుమతించారు. పాలమంగళం పాలీశ్వరస్వామి, తుంబూరులోని తుంబీశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకాలను నిర్వహించి, ఆలయన్ను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

సురుటుపల్లి దేవస్థానంలో..

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి దేవస్థానంలో బుధవారం ఉదయం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ శివగామి సమేత నటరాజ స్వామివారికి మహాదీపారాధాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, జి.మునివేలు, యస్.మంజుల, ఉమాపతి, ఊత్తుకోట్టైకి చెందిన ఆయరం వైశ్య శెట్టియార్ సంఘం వారి సమక్షంలో శ్రీ శివగామి సమేత నటరాజ స్వామి వారు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా సురుటుపల్లి గ్రామోత్సవం మీదుగా ఊత్తుకోట్టైకి స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా వెళ్లారు.